జైలు నుంచి విడుదలైన అనంతరం కేటీఆర్‌ను ఆలింగనం చేసుకొని భావోద్వేగానికి లోనైన ఎమ్మెల్సీ కవిత. చిత్రంలో కవిత భర్త అనిల్, కుమారుడు ఆదిత్య, హరీశ్‌రావు

ఉద్విగ్న వాతావరణంలో
కవిత విడుదల

- తీహార్ జైలు వద్ద భారీ స్వాగతం
- కేటీఆర్, హరీశ్ సహా తరలిన బీఆర్‌ఎస్ ముఖ్య నేతలు
- జైలు నుంచి రాగానే కవిత భావోద్వేగం
- 'కవిత.. డాటర్ ఆఫ్ ఫైటర్' అంటూ జాగృతి కార్యకర్తలు, నేతల నినాదాలు
- నేడు హైదరాబాద్ రానున్న కవిత

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మంగళవారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో ఉద్విగ్నభరిత వాతావరణంలో తీహార్ జైలు నుంచి విడుదలయ్యారు. బెయిల్‌కు సంబంధించిన లాంఛనాలన్నీ పూర్తయ్యాక ఆమె జైలు నుంచి బయటకు వచ్చారు. కవిత బెయిల్ పిటిషన్ మంగళవారం సుప్రీం కోర్టు ముందుకు వస్తున్న నేపథ్యంలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ సోమవారమే ఢిల్లీకి వెళ్లారు. వారితోపాటు మాజీ మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, సత్యవతి రాథోడ్, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేశ్, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, ముఠా గోపాల్, ఎమ్మెల్సీలు శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎంపీ కవిత, పలువురు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా ఢిల్లీ వెళ్లారు. మంగళవారం ఉదయమే సుప్రీం కోర్టు వద్దకు చేరుకున్నారు. కవిత కేసుకు సంబంధించిన కోర్టు హాలు వద్ద వాదనలను ఆసాంతం విన్నారు. తీర్పు కోసం ఆతృతగా ఎదురుచూశారు. న్యాయస్థానం బెయిల్ ఇస్తున్నట్టు చెప్పిన వెంటనే కేటీఆర్ ముఖంలో పట్టరాని ఆనందం కనిపించింది. న్యాయమూర్తి తీర్పు చెప్పే సమయంలో కేటీఆర్ ఒకింత ఉద్విగ్నానికి లోనయ్యారు. తీర్పు వచ్చిన తర్వాత బయటకు వచ్చిన కేటీఆర్, హరీశ్ రావు అక్కడ ఉన్న పార్టీ నేతలను ఆలింగనం చేసుకొని తమ ఆనందాన్ని పంచుకున్నారు. తుది తీర్పు రావడంతో వెంటనే తదుపరి కార్యాచరణ రూపొందించుకునేందుకు, బెయిల్ కాపీలు, ష్యూరిటీలు తదితర వాటి గురించి న్యాయవాదులతో మాట్లాడారు. ష్యూరిటీల్లో ఒకటి కవిత భర్త అనిల్‌కుమార్ ఇవ్వగా మరోటి ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఇచ్చారు. సుప్రీం కోర్టులో లాంఛనాలను పూర్తిచేసుకొని అక్కడి నుంచి ఎంపీ వద్దిరాజు నివాసానికి ఆటోలోనే కేటీఆర్ వెళ్లారు. కోర్టు వద్ద ప్రజలు ఎక్కువగా ఉండటం, అందుబాటులో ఆటో రావటంతో అందులో వద్దిరాజు నివాసానికి వెళ్లారు.

జైలు వద్ద భారీ స్వాగతం

తీహార్ జైలు నుంచి మంగళవారం పొద్దుపోయిన తర్వాత కవిత విడుదలయ్యారు. రౌస్ అవెన్యూ న్యాయస్థానం నుంచి కవిత బెయిల్‌కు సంబంధించిన పత్రాలను న్యాయవాదులు జైలు అధికారులకు సమర్పించారు. జైలు లాంఛనాలు పూర్తయిన తర్వాత రాత్రి తొమ్మిది గంటల సమయంలో ఆమె బయటకు వచ్చారు. కవిత విడుదల సందర్భంగా తీహార్ జైలు వద్దకు పార్టీ శ్రేణులు భారీగా చేరుకున్నాయి. హరీశ్ రావు, కేటీఆర్‌తోపాటు పార్టీ పార్లమెంటరీ పార్టీ నేత కేఆర్ సురేశ్‌రెడ్డి, ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, దీవకొండ దామోదర్‌రావు, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, శంభీపూర్ రాజు, కేపీ వివేక్ తదితరులు కూడా వచ్చారు. కవిత భర్త అనిల్ కుమార్, ఆమె పిల్లలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, మాజీ ఎంపీలు, వివిధ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు, జాగృతి కార్యకర్తలు పెద్ద ఎత్తున కవితకు జైలు వద్ద స్వాగతం పలికారు. గంటల తరబడి వేచి చూసిన వీరంతా 'కవిత.. డాటర్ ఆఫ్ ఫైటర్' అంటూ పెద్దపెట్టున నినాదాలు చేస్తూ ప్లకార్డులు పట్టుకొని కవితకు స్వాగతం పలికారు. జైలు పరిసరాల్లో మిఠాయిలు పంచారు. జైలు నుంచి కవిత నేరుగా వసంత విహార్‌లో ఉన్న పార్టీ కార్యాలయానికి వెళ్లారు.

కవిత భావోద్వేగం.. నేడు హైదరాబాద్ రాక

జైలు నుంచి బయటకు వచ్చిన కవిత తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. గేటు బయటే ఉన్న పెద్ద కొడుకు ఆదిత్య, భర్త అనిల్, సోదరుడు కేటీఆర్‌ను ఆలింగనం చేసుకొని కన్నీటిపర్యంతమయ్యారు. బుధవారం మధ్యాహ్నం 2.45గంటలకు ఢిల్లీ నుంచి హైదరాబాద్ బయల్దేరనున్నారు. నేరుగా శంషాబాద్ విమానాశ్రయానికి రానున్నారు. కవిత రాక సందర్భంగా అభిమానులు, తెలంగాణ జాగృతి కార్యకర్తలు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నేతలు ఆమెకు సాదరస్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

వడ్డీతో సహా చెల్లిస్తం

- నేను కేసీఆర్ బిడ్డను.. తప్పు చేయను
- నేను మొండిదాన్ని.. నన్ను అనవసరంగా జైలుకు పంపి జగమొండిని చేసిండ్రు
- కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టాలనే దురుద్దేశంతోనే నన్ను జైలుకు పంపిండ్రు
- ప్రజాక్షేత్రంలో గట్టిగా పనిచేస్తం
- పోరాటం నా రక్తంలోనే ఉన్నది
- న్యాయం కోసం పోరాడుతం
- రాజకీయంగా యుద్ధం చేస్తం
- నిప్పులు చెరిగిన ఎమ్మెల్సీ కవిత
- కష్టకాలంలో తన కుటుంబానికి తోడున్న అందరికీ ధన్యవాదాలు తెలిపిన కవిత

మీడియాతో మాట్లాడుతున్న కవిత

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): 'పద్దెనిమిదేండ్లు నేను రాజకీయాల్లో ఉన్న.. ఎన్నో ఎత్తుపల్లాలు చూసిన.. ఒక తల్లిగా ఐదున్నర నెలలు పిల్లలను, కుటుంబాన్ని వదిలి ఉండడమన్నది చాలా ఇబ్బందికర విషయం.. నన్ను నా కుటుంబాన్ని ఇబ్బందుల పాలు చేసినవారికి తప్పకుండా వడ్డీతో సహా చెల్లిస్తం.. సమయం వస్తది.. తప్పకుండా చెల్లిస్తం' అంటూ ఎమ్మెల్సీ కవిత ఉద్వేగానికి లోనయ్యారు. 'నేను తెలంగాణ బిడ్డను. కేసీఆర్ బిడ్డను. నేను తప్పు చేసే ప్రసక్తే లేదు. నేను మొండిదాన్ని. అనవసరంగా జైలుకు పంపి నన్ను జగమొండిని చేసిన్రు' అంటూ ఉబికి వస్తున్న కన్నీళ్లను ఉగ్గబట్టుకొని మాట్లాడారు.

మంగళవారం తీహార్ జైలు నుంచి బయటికి వచ్చాక ఆమె తన కొడుకును ముద్దాడారు. భర్త అనిల్‌రావు, అన్న కేటీఆర్‌ను ఆలింగనం చేసుకొని కన్నీటిపర్యంతమయ్యారు. మాజీ మంత్రి హరీశ్‌రావు సహా కుటుంబసభ్యులను కలుసుకొని ఉద్విగ్నానికి లోనయ్యారు. అనంతరం ఆమె మీడియాతో కొంతసేపు మాట్లాడారు. తనను ఉద్దేశపూర్వకంగా రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా జైలుకు పంపారని నిప్పులు చెరిగారు. 'జై తెలంగాణ..జై తెలంగాణ.. అందరికీ నమస్కారం. ఐదున్నర నెలల తర్వాత మీ అందర్నీ కలవటం చాలా సంతోషం. ఇక్కడికి వచ్చినటువంటి బీఆర్‌ఎస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, మీడియా మిత్రులకు అందరికీ పేరుపేరునా నమస్కారాలు. ఇటువంటి కష్టసమయంలో నాకూ నా కుటుంబానికి తోడున్న వారందరికీ హృదయపూర్వకంగా పాదాభివందనాలు తెలియజేస్తున్నా' అంటూ కంటతడి పెట్టుకున్నారు.

నేను తెలంగాణ బిడ్డను..

'ఐదున్నర నెలల తరువాత నా కొడుకు, నా భర్త, నా అన్నతో కలిసే అవకాశం లభించింది. అందరికీ తెలుసు. రాజకీయ కక్షతోనే నన్ను జైల్లో పెట్టారు. ఇబ్బందేమీ లేదు. తప్పకుండా మేం పోరాటం చేస్తాం. ఎవరి గురించి చెప్పే అవసరం లేదు. నేను తెలంగాణ బిడ్డను. నేను కేసీఆర్ బిడ్డను. కేసీఆర్ బిడ్డగా నేను తప్పు చేసే ప్రసక్తే లేదు. ప్రజాక్షేత్రంలో ఇంకా గట్టిగా పనిచేస్తం. కమిట్‌మెంట్‌తో పనిచేస్తం. అందరితో కలిసి పనిచేస్తం. న్యాయం కోసం పోరాటం చేస్తం. రాజకీయంగా యుద్ధమే చేస్తం. అకారణంగా.. అన్యాయంగా రాజకీయ కక్షసాధింపులో భాగంగా కేసీఆర్ బిడ్డను ఇబ్బంది పెట్టడం ద్వారా కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టాలనే దురుద్దేశంతో జైలుకు పంపారు' అని ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేశారు.

మీకు పుణ్యముంటుంది.. నన్ను డిశ్చార్జి చేయకండి సారూ.. బయట మా ఇల్లు కూల్చేశారు!

కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌కు
అభినందనలు

కేంద్ర మంత్రి బండి సంజయ్ ట్వీట్

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసిన నేపథ్యంలో..'కాంగ్రెస్ పార్టీకి, వారి న్యాయవాదులకు కంగ్రాట్స్' అంటూ కేంద్రమంత్రి బండి సంజయ్ మంగళవారం ట్వీట్ చేశారు. 'మీ అవిశ్రాంత కృషి చివరికి ఫలించింది. ఈ బెయిల్ బీఆర్‌ఎస్, కాంగ్రెస్ సమిష్టి విజయం' అని బండి సంజయ్ పేర్కొన్నారు. బెయిల్ కోసం వాదించిన అభ్యర్థికి బీఆర్‌ఎస్ మద్దతు ఇవ్వడం, కాంగ్రెస్ అభ్యర్థి ఏకగ్రీవంగా రాజ్యసభకు నామినేట్ కావడం, క్విడ్‌ప్రోకోగా ఆయన ఆరోపించారు. విలీనం మాట ముచ్చట పూర్తయింది 'అప్పగింతలే' తరువాయి అని పేర్కొన్నారు.

బీజేపీలో బీఆర్‌ఎస్ విలీనంతోనే బెయిల్

రేవంత్‌రెడ్డిని ఇబ్బంది పెట్టేందుకే ఎత్తుగడ

కాంగ్రెస్ ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): బీజేపీలో బీఆర్‌ఎస్ విలీనం అవుతున్నందుకే ఎమ్మెల్సీ కవితకు బెయిల్ ఇచ్చారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ ఆరోపించారు. బీజేపీలో బీఆర్‌ఎస్ విలీన ప్రక్రియ కవితకు బెయిల్ ద్వారా మొదలైందని విమర్శించారు. ఢిల్లీలో కేటీఆర్, హరీశ్‌రావు బీజేపీ సీనియర్ నేతలతో పలు దఫాలుగా జరిపిన చర్చల ఫలితంగానే ఈడీ ఉదాసీనంగా బెయిల్ ఇచ్చేందుకు సహకరించిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని ఇబ్బంది పెట్టడానికి బీజేపీ, బీఆర్‌ఎస్ కూడగట్టుకొని ముందుకు వెళ్తున్నాయని ఆరోపించారు.

బండివి చౌకబారు ప్రేలాపనలు

- ఎమ్మెల్సీ కవితకు వచ్చిన బెయిల్‌ను కాంగ్రెస్, బీఆర్‌ఎస్ బంధంతో పోల్చడం దుర్మార్గం
- ఆ వ్యాఖ్యలను కోర్టు ధిక్కరణగా స్వీకరించాలి
- సీజేఐకి కేటీఆర్ విజ్ఞప్తి

ఢిల్లీలో సుప్రీంకోర్టు వద్ద ఆటోలో ప్రయాణిస్తున్న కేటీఆర్, పాడి కౌశిక్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు బెయిల్ మంజూరు నేపథ్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను కోర్టు ధిక్కారంగా పరిగణించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. సుప్రీంకోర్టుకు ఉద్దేశాలు ఆపాదించేలా కామెంట్స్ చేసిన బండి సంజయ్ తీరును తీవ్రంగా తప్పుబట్టారు. కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడం కాంగ్రెస్, బీఆర్‌ఎస్ విజయమంటూ బండి సంజయ్ చేసిన ట్వీట్‌ను కేటీఆర్ ఖండించారు. కాంగ్రెస్ లాయర్ చేసిన కృషితో ఒకరికి బెయిల్ వస్తే, బీఆర్‌ఎస్ మద్దతు కారణంగా ఆ న్యాయవాది రాజ్యసభలో స్థానం పొందారంటూ సంజయ్ వివాస్పద వ్యాఖ్యలు చేసిన విషయాన్ని కేటీఆర్ ఉటంకించారు. వైన్ అండ్ డైన్ క్రైమ్‌లో పార్టనర్స్ అయిన కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌కు కంగ్రాట్యులేషన్స్ అంటూ బండి సంజయ్ తన స్థాయిని మరిచి సుప్రీంకోర్టు తీర్పును అపహాస్యం చేశారని కేటీఆర్ మండిపడ్డారు. కేంద్రమంత్రిగా ఉంటూ చౌకబారుగా మాట్లాడతారా? అని ఆగ్రహం వ్యక్తంచేశారు.

కేసులో కవిత పాత్ర ఎక్కడుంది?

జాతీయ మీడియాలోనూ ఇవే కథనాలు

'సత్యమేవ జయతే' హ్యాష్‌ట్యాగ్ ట్రెండింగ్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): 'మద్యం విధానం' కేసులో ఎమ్మెల్సీ కవితకు బెయిల్ రావడాన్ని జాతీయ మీడియా ప్రముఖంగా ప్రచురించింది. టీవీ చానళ్లు డిబేట్లు నిర్వహించాయి. కేసు దర్యాప్తునకు సంబంధించి ఈడీ, సీబీఐ వైఖరిపై మండిపడుతూ సుప్రీంకోర్టు చేసిన కీలక వ్యాఖ్యలనే హెడ్డింగ్స్‌గా ప్రచురించింది. ఈ కేసులో కవితకు ప్రమేయంలేదని, చివరకు న్యాయమే గెలించిందంటూ సోషల్‌మీడియాలో నెటిజన్లు కామెంట్లు చేశారు. 'కవిత', 'సత్యమేవ జయతే' హ్యాష్‌ట్యాగ్‌లు ట్రెండింగ్ అయ్యాయి.

ఢిల్లీ మద్యం పాలసీ కేసులో
కీలక పరిణామాలు

(2022 ఆగస్టు నుంచి.. 2024 ఆగస్టు వరకు..)

ఢిల్లీ మద్యం పాలసీ విధానంపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను 2022 ఆగస్టు నుంచి టార్గెట్ చేశారు. అదే సంవత్సరం డిసెంబర్ 2న కవితను విచారిస్తామంటూ సీబీఐ నోటీసులు ఇచ్చింది. 2024 మార్చి 15న కవిత ఇంటికి వచ్చి కొన్ని గంటలపాటు విచారణ జరిపిన ఈడీ అధికారులు అదే రోజు రాత్రి ఆమెను అరెస్టు చేశారు. తేదీల వారీగా ఈ కేసులో ముఖ్య పరిణామాలు..

2022 ఆగస్టు 21: ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను టార్గెట్ చేసిన బీజేపీ కేంద్ర నాయకత్వం ఆ పార్టీ ఎంపీ పర్వేశ్‌వర్మ, మాజీ ఎమ్మెల్యే మంజిందర్ సిర్సా ద్వారా బయటపెట్టించింది. ఆగస్టు 22న రాష్ట్ర బీజేపీ నాయకులు కవిత ఇంటిపై దాడికి తెగబడ్డారు.

2022 సెప్టెంబర్ 5: ఈ కేసులో కవిత బ్లాక్‌మనీ పెట్టుబడిగా పెట్టారని, సమగ్ర దర్యాప్తు చేపట్టాలని ఈడీ, సీబీఐ అధికారులకు బక్క జడ్సన్ ఫిర్యాదు

2022 నవంబర్ 26: అభియోగపత్రంలో తొలిసారిగా ఎమ్మెల్సీ కవిత పేరును ప్రస్తావించిన ఈడీ

2022 డిసెంబర్ 2: కవితకు సీఆర్పీసీ సెక్షన్ 160 కింది నోటీసులు ఇచ్చిన సీబీఐ.. డిసెంబర్ 6న విచారిస్తామని, ఢిల్లీ, హైదరాబాద్‌లో ఎక్కడ సౌకర్యమో చెప్పాలని కోరింది.

2022 డిసెంబర్ 5: ఇతర కార్యక్రమాల వల్ల డిసెంబర్ 11, 12, 13, 14, తేదీల్లో అందుబాటులో ఉంటానని కవిత తెలిపారు. దీంతో సీబీఐ డిసెంబర్ 11న విచారణకు వస్తామని తెలపడంతో ఆమె వెల్‌కమ్ చెప్పారు.

2022 డిసెంబర్ 11: ఒక మహిళా అధికారితోపాటు 11 మంది అధికారులు కవిత ఇంటికి వచ్చారు. వారిలో ఐదుగురు సభ్యులతో కూడిన బృందం కవితను విచారించింది.

2023 మార్చి 8: ఎమ్మెల్సీ కవితకు నోటీసులిచ్చిన ఈడీ మార్చి 9న హాజరు కావాలని కోరింది. అందుకు కవిత మార్చి 11న హాజరవుతానని బదులిచ్చారు.

2023 మార్చి 11: తొలిసారిగా హైదరాబాద్‌లోని తన ఇంట్లో ఈడీ ముందు హాజరైన కవిత.. దాదాపు 9 గంటలపాటు విచారణను ఎదుర్కొన్నారు.

2023 మార్చి 15: ఈడీ చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నదంటూ కవిత సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

2023 మార్చి 16: మొదటి విచారణ అనంతరం మార్చి 11న నోటీసులు ఇచ్చి.. రెండోసారి విచారణకు మార్చి 16న హాజరుకావాలని ఈడీ కోరింది. రెండో విచారణకు ఈడీ అడిగిన పత్రాలను న్యాయవాదితో కవిత పంపారు.

2023 మార్చి 20: మూడో విచారణకు 2023 మార్చి 20న ప్రత్యక్షంగా హాజరుకావాలని మార్చి 16న ఈడీ నోటీసులు జారీ చేసింది. దీంతో కవిత ఈడీ ఎదుట హాజరై పదిన్నర గంటలపాటు విచారణ ఎదుర్కొన్నారు. ఈ సందర్భంగా తన ఎనిమిది ఫోన్లని ఈడీకి కవిత సమర్పించారు.

2023 మార్చి 20: ఈడీ విచారణ ఎదుర్కొన్న కవిత.. అదేరోజు నోటీసులు అందుకొని ఆ మరుసటి రోజు మార్చి 21న మరోమారు విచారణకు హాజరయ్యారు.

2023 మే 7: 'ఢిల్లీ మద్యం పాలసీ కేసులో అసలు కుంభకోణం ఎలా జరిగింది? ఎక్కడ జరిగింది? చెప్పండి. సాక్ష్యాధారాలతో దర్యాప్తు కొనసాగలేదు. రూ.వంద కోట్ల అక్రమాలంటూ.. రూ.లక్షల్లో నగదు చూపిస్తున్నారు. తగిన ఆధారాలు చూపించండి' అంటూ ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు ఈడీకి చురకలంటించింది.

2023 సెప్టెంబర్ 26: మద్యం పాలసీ కేసులో ఈడీ ఇచ్చిన సమన్లను కవిత సవాల్ చేయగా 2023 సెప్టెంబర్ 26న సుప్రీంకోర్టు విచారణ చేపట్టి.. నవంబర్ 20 వరకూ ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ఆదేశాలు జారీ చేసింది.

2024 ఫిబ్రవరి 21: మద్యం పాలసీ కేసులో ఫిబ్రవరి 26న తమ ఎదుట విచారణకు హాజరుకావాలని సీబీఐ నోటీసులు జారీ చేసింది.

2024 ఫిబ్రవరి 25: ఫిబ్రవరి 26న విచారణకు హాజరుకాలేనంటూ ఫిబ్రవరి 25న సీబీఐకి కవిత లేఖ రాశారు.

2024 మార్చి 15: విచారణ పేరుతో హైదరాబాద్‌లోని కవిత ఇంటికి మధ్యాహ్నం 1.45 గంటలకు వచ్చిన ఈడీ అధికారులు.. కొన్ని గంటలపాటు ఆమెను విచారించారు. రాత్రి 8.45 గంటలకు ఎలాంటి వారెంట్ లేకుండా అదుపులోకి తీసుకున్నారు. అర్ధరాత్రి ఢిల్లీలోని ఈడీ ఆఫీసుకు తరలించారు.

2024 మార్చి: తన కుమారుడికి పరీక్షలు ఉన్నందున బెయిలివ్వాలని తొలిసారి కవిత బెయిల్ పిటిషన్ వేశారు.

2024 ఏప్రిల్ 11: ఇదే కేసులో తీహార్ జైల్లో ఉన్న కవితను సీబీఐ అదుపులోకి తీసుకున్నది.

2024 జూలై 16: అస్వస్థతకు గురైన ఎమ్మెల్సీ కవిత

2024 జూలై: తనపై తప్పుడు అభియోగాలు మోపారని మళ్లీ ట్రయల్ కోర్టులో బెయిల్ పిటిషన్ వేసిన కవిత

2024 జూలై: ఈడీ, సీబీఐ కేసుల్లో ఏకంగా సుప్రీంకోర్టుకు వెళ్లాలని నిర్ణయం. ట్రయల్ కోర్టులో వేసిన బెయిల్ పిటిషన్ వెనక్కి తీసుకున్న కవిత

2024 ఆగస్టు 7: ఢిల్లీ హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన కవిత

2024 ఆగస్టు 20: కవిత బెయిల్ పిటిషన్‌పై మరోసారి వాదనలు జరిగాయి.

2024 ఆగస్టు 22: మరోసారి అస్వస్థతకు గురైన కవిత

2024 ఆగస్టు 27: ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరు చేసిన సుప్రీంకోర్టు

ఢిల్లీ మద్యం పాలసీ కేసులో అరెస్టులు ఇలా..

ఢిల్లీ మద్యం పాలసీ కేసులో సీఎం కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా, ఎమ్మెల్సీ కవిత సహా పలువురు అరెస్టయ్యారు. వీరిలో కొందరికి బెయిల్ రాగా, మరికొందరికి రాలేదు.

- **2022 సెప్టెంబర్ 6:** ఆప్ నేత విజయ్‌నాయర్ అరెస్టు, రెగ్యులర్ బెయిల్ రాలేదు.
- **2023 ఫిబ్రవరి 26:** మనీశ్ సిసోడియా అరెస్టు, 2024 ఆగస్టు 9న బెయిల్
- **2023 ఫిబ్రవరి 1:** మాగుంట రాఘవ అరెస్టు, 2023 ఆగస్టు 10న బెయిల్
- **2023 అక్టోబర్ 4:** సంజయ్ సింగ్ అరెస్టు, 2024 ఏప్రిల్ 2న బెయిల్
- **2024 మార్చి 21:** అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు, ఇంకా బెయిల్ రాలేదు
- **2023 ఫిబ్రవరి 8:** గౌతమ్ మల్హోత్ర అరెస్టు, 2023 మే 7న బెయిల్
- **2022 సెప్టెంబర్ 28:** సమీర్ మహేంద్రు అరెస్టు, రెగ్యులర్ బెయిల్ రాలేదు
- **2022 నవంబర్ 29:** అమిత్ అరోరా అరెస్టు, రెగ్యులర్ బెయిల్ రాలేదు
- **2022 నవంబర్ 10:** పీ శరత్‌చంద్రారెడ్డి అరెస్టు, 2023 మే 8న బెయిల్
- **2022 అక్టోబర్ 10:** అభిషేక్ బోయినపల్లి అరెస్టు, 2024 మార్చి 20న మధ్యంతర బెయిల్‌పై విడుదల
- **2023 ఫిబ్రవరి 9:** బుచ్చిబాబు గోరంట్ల అరెస్టు, 2023 మార్చి 6న బెయిల్
- **2022 నవంబర్:** 10న బినయ్‌బాబు అరెస్టు, 2023 డిసెంబరు 8న బెయిల్
- **2023 ఫిబ్రవరి 8:** రాజేశ్ జోషి అరెస్టు, 2023 మే 7న బెయిల్
- **2023 జూలై 6:** దినేశ్ అరోరా అరెస్టు, 2023 ఆగస్టు 1న బెయిల్
- **2024 మార్చి 15:** ఎమ్మెల్సీ కల్వకుంట్ల అరెస్టు.. 2024 ఆగస్టు 27న బెయిల్
- **2024 ఏప్రిల్ 15:** చన్‌ప్రీత్ సింగ్ అరెస్టు, ఇంకా బెయిల్ రాలేదు

పార్టీ నేతలతో ఎమ్మెల్సీ కవిత భేటీ

- పార్టీ క్యాడర్‌కు కేటీఆర్ కృతజ్ఞతలు

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బీఆర్‌ఎస్ పార్టీ కుటుంబ సభ్యులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. తీహార్ జైలు నుంచి బెయిల్‌పై మంగళవారం బయటికి వచ్చిన తరువాత ఆమె పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, పార్టీ పార్లమెంటరీ నేత కేఆర్ సురేశ్‌రెడ్డి, ఎంపీలు దామోదర్‌రావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలతో కలిసి నేరుగా ఢిల్లీ వసంతవిహార్‌లోని తెలంగాణభవన్‌కు బయలుదేరారు. తెలంగాణభవన్‌లో ఆమెకు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఎమ్మెల్సీలు శేరి సుభాశ్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, శంభీపూర్ రాజు, మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, వీ శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, డాక్టర్ సంజయ్, కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, పాడి కౌశిక్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, అనిల్ జాదవ్, బీ లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, మాజీ ఎమ్మెల్సీలు నారదాసు లక్ష్మణ్‌రావు, కర్నె ప్రభాకర్, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్లు గజ్జెల నగేశ్, కే వాసుదేవరెడ్డి, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, వై సతీశ్‌రెడ్డి తదతరులతో కవిత సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఢిల్లీకి స్వచ్ఛందంగా వచ్చి కుటుంబానికి, పార్టీకి అండగా ఉన్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. కష్టకాలంలో అండగా ఉన్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం మధ్నాహ్నం హైదరాబాద్ రానున్నట్టు వెల్లడించారు. సమావేశ మందిరంలోకి వచ్చిన తరువాత ఆమెకు కేటీఆర్ మిఠాయి తినిపించి స్వాగతం పలికారు.

ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో పార్టీ నేతల సమావేశంలో మిఠాయి తినిపించుకుంటున్న కేటీఆర్, కవిత

అరెస్టు..విచారణ అన్యాయం

- కవితపై మోపిన అభియోగాలన్నింటినీ సుప్రీంకోర్టు తిరస్కరించింది
- కడిగిన ముత్యంలా ఆమె బయటకొచ్చారు
- కవిత తరపు న్యాయవాది మోహిత్‌రావు

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టు ఇల్లీగల్, అన్‌ఫెయిర్ ప్రాసిక్యూషన్ అని సుప్రీంకోర్టు స్పష్టం చేసినట్టు ఆమె తరపు న్యాయవాది మోహిత్‌రావు తెలిపారు. కవితకు మంగళవారం బెయిల్ మంజూరైన అనంతరం ఆయన సుప్రీం కోర్టు ఆవరణలో మీడియాతో మాట్లాడారు. కవితను మార్చి 15న అన్యాయంగా అరెస్టు చేశారని, అన్యాయంగా విచారిస్తున్నారని చెప్తూనే ఉన్నానని, ఇదే విషయాన్ని ఇప్పుడు అత్యున్నత ధర్మాసనం వెల్లడించిందని చెప్పారు. కడిగిన ముత్యంలా బయటకొస్తానని కవిత చెప్పారని, ఇప్పుడు అలాగే బయటకు వచ్చారని పేర్కొన్నారు. ఈ కేసులో కవిత ప్రమేయం లేదని సుప్రీం కోర్టు స్పష్టం చేసిందని, కవితపై మోపిన అన్ని అభియోగాలను తిరస్కరించిందని వివరించారు. ఈ కేసుకు సంబంధించి ఎలాంటి ఆర్థిక లావాదేవీలు లేవని, ఎక్కడా నగదు అంశం బయటపడలేదని చెప్పారు. కేవలం కేసీఆర్ బిడ్డ అన్న కక్షతోనే అరెస్టు చేశారని, పార్లమెంట్ ఎన్నిలకు ఒక్కరోజు ముందు ఆమెను అరెస్టు చేయడం వెనుక మతలబు ఏమిటని, ఎన్నికల ప్రచారానికి వస్తారని భయపడ్డారా? అని ప్రశ్నించారు. విడుదలైన తర్వాత చట్టప్రకారం విచారణకు కవిత సహకరిస్తారని, కోర్టు వాయిదాలకు హాజరవుతారని తెలిపారు.

మీడియాతో మాట్లాడుతున్న మోహిత్‌రావు

కవితకు బెయిల్

మొదటిపేజీ తరువాయి...

నిరోధక చట్టంలోని 45వ సెక్షన్ ప్రకారం మహిళను ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేసింది. సీబీఐ చార్జిషీట్ దాఖలు చేయడం, ఈడీ దర్యాప్తు పూర్తి కావడం, మహిళకు ఉన్న ప్రత్యేక వెసులుబాటు దృష్ట్యా బెయిల్ మంజూరు చేస్తున్నట్టు ద్విసభ్య ధర్మాసనం తెలిపింది. కానీ, కవితకు బెయిల్ మంజూరైన ఐదు నిమిషాలోనే కాంగ్రెస్, బీజేపీ విషం కక్కడం మొదలుపెట్టాయి. ఆయా పార్టీల నేత లు ఏకంగా కోర్టు తీర్పునే తప్పుబట్టారు. వాస్తవానికి బీఆర్‌ఎస్‌ను రాజకీయంగా ఎదుర్కొనే దమ్ములేక బీజేపీ, కాంగ్రెస్ రెం డ్లుగా ఆడబిడ్డను వేధిస్తూనే ఉన్నాయి. విచారణ సంస్థల కన్నాముందే 2022 ఆగస్టు 21న ఢిల్లీ మద్యం పాలసీ కేసులో కవిత పేరును బీజేపీ నేతలు ప్రస్తావించడమే ఇందుకు ఉదాహరణ. నాటి నుంచి కేంద్ర ప్రభుత్వ జేబు సంస్థలు ఈడీ, సీబీఐ విచారణ పేరుతో వెంటాడుతుంటే.. కాం గ్రెస్, బీజేపీ విష ప్రచారంతో వేధించాయి. విచారణకు పిలిచిన ప్రతిసారీ సహకరించినా, ఆధారాలన్నింటినీ సమర్పించినా దర్యాప్తు సంస్థలు వదిలిపెట్టలే దు. ఈ ఏడాది మార్చి 15న అక్రమంగా అరెస్ట్ చేశాయి. రెండేండ్లుగా రాజకీయంగా ఎన్నికుట్రలు, కుతంతాలు చేసి నా.. 165 రోజులుగా జైలులో ఉంచి శారీరకంగా, మానసికంగా ఎంత హింసించినా కవిత మొక్కవోని దీక్షతో నిలబడ్డారు. రాజకీయ కక్షతోనే తనను కేసులో ఇరికించారని న్యాయస్థానంలో గట్టిగా పోరాడారు. చివరికి న్యాయదేవత సాక్షిగా గెలిచి.. బయటికి వచ్చారు.